పెద్ద కథ

# చిగుళ్ళు




పులికంటి కృష్ణారెడ్డి

నిలువుటద్దం ముందు వయ్యారంగా నిలబడిన ఒక సోకులాడి తీరిగ్గా అందగించుకోవాలని ఆతురత పడుతున్నట్లుగా ఆ ఊరు మునిమాపువేళ ముస్తాబు చేసుకోవడానికి సిద్ధపడుతూ వుంది.

పసిడిఛాయల ఎత్తిపోతల్లో తలమునకలవుతూ పడమటి కొండ కొన కొమ్మును రాగరంజితం చేస్తున్న సూర్యుడు... కడుపారమేసి పొదుగులనిండాచేపి అరమోడ్పు కన్నులతో ఇంటిముఖం పట్టిన ఆలమందలు... అష్టకో ఆశ్రయానికో ఉన్నవాడి చుట్టూ చెప్పలు అరిగేటట్టు తిరిగే లేనివాడిలా ఆ రాత్రి తలదాచుకోవడానికి తావుకై చెట్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ పక్షులు... వంచిన నడుం ఎత్తకుండా పొద్దస్తమానం రక్తాన్ని చెమటగా మార్చిన తృప్తితో పొలాల్లో రైతులు... నిగనిగ బంగారు కాంతులను విలువెల్లా

9-2-96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక




నింపుకొని ఆ ఊరికి కాపలాకాస్తున్న వీరుల్లా బోడి గుట్టలు... గాలివాటంగా ఉయ్యాలలూగుతూ పైరుపచ్చలు...

చిత్రిస్తూ చిత్రిస్తూ వుండిన ఒక రమణీయ వర్ణచిత్రం మీద ఉన్నట్లుండి సిరా వొలికి పాడైనట్లు మునిమాపువేళ ఆ ఊరు చేసుకొంటున్న ముస్తాబు ఛిద్రమైపోయింది - ఆగమేఘాలమీద ఒక పోలీస్ వ్యాన్ ఆ ఊళ్ళోకి రావడంతో!

ఆ ఊళ్ళో రచ్చబండ వద్ద పోలీస్ వ్యాన్ నిలబడింది. నిలబడీ నిలబడకముందే అందులో నుండి ఒక సబ్-ఇన్స్పెక్టర్, ఇద్దరు పోలీసులూ గబగబ కిందికి దూకారు.

వాళ్ళను చూసిన పిల్లలు 'పోలీసోళ్ళు! పోలీసోళ్ళు!' అంటూ పరుగెత్తుతున్నారు. 'ఊళ్ళో కావాలన్నా సారాయి కలికానికైనా దొరకదే?... మద్యపాన నిషేధాన్ని అక్షరాలా అమలు జరిపిస్తున్నామే. మరి ఈ వేళకాడ పోలీసులు రావడమా?' అని ఆడవాళ్ళు ఆశ్చర్యంగా పోలీస్‌వ్యాన్‌ని చూస్తున్నారు. వయసు పైబడి ఇంటిపట్టున్నే ఉన్న కొంతమంది పెద్దోళ్ళు ఆ వ్యాన్ వద్దకు 'పోవాలా? వద్దా?' అన్న సంశయంలో పడి తటపటాయిస్తున్నారు. 'పోలీసోళ్ళయితే ఏం? వాళ్ళేకేవన్నా రొండు కొమ్ములు మొల్చి ఉంటాయా?' అంటూ కొందరు యువకులు ఆ వ్యాన్ దగ్గరికి పోయారు.

"ఈ ఊళ్ళో పరమానందరెడ్డి ఇల్లెక్కడ?"

వ్యాన్ దగ్గరికి వచ్చిన యువకులను ఉద్దేశించి సబ్-ఇన్స్పెక్టరు అడిగాడు.

"పరమానందరెడ్డి ఇల్లెక్కడా? ఆయనకేం గాచ్చారవా ఇల్లెక్కేదానికి. రేపెరో పాడో వస్తే కూలోళ్ళనుపెట్టి ఇల్లెక్కమంటాడు."

"ఏమన్నావురా రాస్కెల్?... నాతోనే పడాసకమా?" బదులు చెప్పిన యువకుడిపైకి లాఠీకట్టె లేచింది. వాడు కాలికి బుద్ధిచెప్పాడు.

"సా!... సా! వాడొక పిచ్చినాయాలు. ఆ యదవనాయల్తో ఏంపనిగానీ నేను చూపిస్తా. నాతోరండి సా!... " ఇంకొక యువకుడు తెలివిగా పోలీసు బుద్ధితో పోటీపడ్డాడు.

సబ్-ఇన్స్పెక్టర్ కనుబొమ ముడివిప్పాడు. లాఠీకట్టెను దించాడు. ఆ కుర్రవాడివైపు సానుకూలంగా చూశాడు. ఆ తర్వాత 'పద పోదాం!' అన్నాడు. వాడు ముందు వాడి వెనుక సబ్-ఇన్స్పెక్టర్. అతని వెనుక సాయుధహస్తులై ఇద్దరు పోలీసులు. రెండుసందుల్లో దూరి మూడు మలుపులు తిరిగి ప్రక్కవీధి చేరుకొన్నారు.

ఆ వీధికే అలంకారప్రాయంగా పరమానందరెడ్డి మహాడీ!

వాడు సందు మొగదల నిలబడ్డాడు. అటుయిటు చూశాడు. కుడిచేతిని పైకెత్తాడు. చూపుడు వ్రేలిని పరమానందరెడ్డి మహాడీ మీదికి గురిపెట్టాడు. సబ్-ఇన్స్పెక్టర్ మొహంలోకి చూస్తూ "అద్దో ఆడ కనపడ్తా వుండాదే.. అదే పరవానందరెడ్డి మాడీ!" అని అన్నాడు. సబ్-యిన్స్పెక్టర్ పోలీసులు ఆ ఇంటి దగ్గరికి నడుస్తూ వుంటే వాడు నిలబడిన చోటు నుండి కదలకుండా వాళ్ళనే చూస్తున్నాడు.

పొద్దుగూట్లో పడింది.

ఇంటి ముందర నిలబడిన పోలీసులను చూసి పరమానందరెడ్డి గుండెల్లో రాయిపడింది. అయినా అదేమీ బయటికి పొక్కకుండా "రండి. ఇన్స్పెక్టర్‌గారూ! రండి. రండి." అంటూ ఆదరాబాదరా ఇంటి ముందు తిన్నెమీద మంచం వాల్చాడు. లోపలికి పోయి తెల్లటి దుప్పటి తెచ్చాడు. విదిలించి మంచం మీద మట్టసంగా పరిచాడు. "గడప తొక్కోనొచ్చి గడపదాటకుండా నిలబడిపోతే ఎట్లాసార్? రండి. రండి.వచ్చి కూర్చోండి సార్!" అంటూ వినయంగా నిలబడి చేతులు జోడించాడు.

"రెడ్డీ! నీ మన్నన మర్యాదలట్లా పక్కనబెట్టు. మేము వచ్చింది అందుకు కాదు. నిన్ను అరెస్టు చేసి తీసుకొని రమ్మని ఆర్డర్స్."

"నాకు అరెస్ట్ ఆర్డర్సా?"

"అవునయ్యా అవును. నిన్ను అరెస్ట్ చేస్తున్నాం"

సందు మొగదల నిలబడుకొన్న యువకుడు పరుగందుకొన్నాడు.

క్షణాల్లో ఊరుగుప్పుమనింది.

నిముషాల్లో ఊరూరుగా పరమానందరెడ్డి ఇంటి ముందు చేరిపోయింది.


"నేనేం తప్పు చేశానయ్యా నన్ను అరెస్ట్ చేసేదానికి?"

"ఆ సంగతి యిక్కడెట్లా తెలుస్తుంది? స్టేషన్ కొస్తే కమ్ముల వెనకతోస్తారు. అప్పుడు తెరలీస్తారు. నడునడు. మంచిగా వచ్చి వ్యాన్ ఎక్కుతావా.."

పరమానందరెడ్డి ఆ ఊళ్ళో మేటి రైతు. ఉన్నవాడే కాదు. అంతో యింతో పరపతి వున్నవాడు. ఊళ్ళో ఒక విధంగా పెత్తనం చలాయిస్తున్నవాడు కూడా. అయినా ఎదురైన పరిస్థితి?.... కలలోనూడా ఊహించనిది. మనిషి వణికిపోతున్నాడు. ఏమి చెప్పాలో తోచడం లేదు. ఏమి చెయ్యాలో తెలియడం లేదు. కాలు కదలడం లేదు. నాలుక పిడచగట్టి మొగం నల్లబడింది. దిక్కేవరన్నట్లుగా దిక్కులు చూస్తున్నాడు.అప్పుడు రంగ ప్రవేశం చేశాడు బాలకృష్ణ. కొంత చదువు. అంతకంత లోకజ్ఞానం. తోడుగా వినయసంపద. పది మందిని ఒక తాటిమీద నడిపించగల సామర్థ్యం. వెరసి బాలకృష్ణ!

"ఇన్స్పెక్టర్‌గారూ! తమ చేతిలో అధికారం వుంది. ఆ అధికారం జారీచేసిన అరెస్ట్ ఆర్డర్స్ వున్నాయి. వాటిని ఎదిరించే దమ్ము ఎవడికుంది? అయినా నాదొక మనవి. పల్లెల్లో అంతో యింతో పరువుగా బతికే రైతులం. ఇట్లాంటి అవమానాల పాలైతే మళ్ళా ఈ పల్లెల్లో తలెత్తుకొని తిరగలేము. గొప్ప మనసు చెయ్యండి. మీరు అనుకుంటే ఏదో ఒక దోవ దొరక్కుండా పోదు" అంటూ చేతులు పట్టుకున్నాడు.

చేతిలో చేయి కలిసింది.




పోలీసు బుద్ధి కొంత మెత్తబడింది.

"అయినా నన్నేం చెయ్యమంటావయ్యా! మీరు మీరు పోట్లాడు కునేది. మధ్య మా మీదికి తెచ్చి పెట్టేది. వాడెవుడు హరిజనుడు? వాడి పేరేమి?"

"మాకడు సార్!" ఒక పోలీస్ గుర్తుచేశాడు.

"ఆ! మాకడు. ఏం రెడ్డీ! వాడికి నువ్వు అప్పిచ్చినావా?"

"ఇచ్చినాను సార్"

"బాండు పత్రాలున్నాయి కదా?"

"ఉన్నాయి సార్"

"ఉన్నాయి గదా? మరి వాటి పరిష్కారం ఎక్కడ జరగాలి?"

"కోర్టులో"

"మరి కోర్టుకు పోకుండా వాడిమీదికిపోతే?"

"ఎవ్వరు ఎవురి మీదికి పాయ్‌నారు సార్? నేను వాడి మీదికా?"

"అవునయ్యా అవును. సాక్షాత్ నువ్వే. వాడి మీదికే!"

"సార్. దేవుడి సాక్షిగా చెప్తున్నాను. బాండు కోర్టులో దాఖల్ చేసినానే కానీ వాడిని పల్లెత్తుమాట అనలేదు"

"అన్నావో లేదో మాకేం తెల్సు?... వాడిచ్చిన కంప్లెయింట్ అదీ!"

"నా మీద కంప్లెయింట్ యిచ్చినాడా?"

"ఇచ్చినాడయ్యా యిచ్చినాడు. 'ఒరేతక్కువ జాతినా కొడకా! కుయ్యో మొర్రో అంటే పోనీలే పాపం! అని సమయానికి సహాయం చేస్తే నన్నే కోర్టుకెక్కిస్తావా? మాలనాకొడకా. అప్పుడుడ్లు అక్కడ పెట్టికదల్రా. లేకుండా బోతే నిన్నిక్కడే నరికి పాలిజల్లిస్తా. ఏ నా కొడుకు అడ్డమొస్తాడో చూస్తా! నీ ఇంటికి అగ్గి పెట్టిస్తా!' అని బండ బూతులు తిట్టా బెదిరించినావంట. వాడేంచేసె. ఏ క్షణంలో అయినా నీ ద్వారా తన ప్రాణం మీదికే వస్తుందని కంప్లెయింట్ రాయించి సాక్షత్ మీ ఎమ్మెల్యే ద్వారానే ఏకంగా మా ఎస్పీ దొరగారి చేతికిప్పించె. ఇంకే వుండాది. మా దొరగారికి మీ ఎమ్మెల్యే మెహర్బానీ కావాలి. ఎమ్మెల్యేగారికి హరిజనుల ఓట్లు కావాలి. నడిమద్దె మాదేముంది? పై ఆఫీసర్లు చెప్పినట్లు చేయాలి. లేకపోతే చెప్ప, దెబ్బలు మీకు కాదు. మాకు. 'పో! ఉన్న పళంగా వాణ్ణి అరెస్ట్ చేసి తీసుకురా!' అంటే వచ్చినాను. ఇప్పుడు చెప్పండి. నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి"

పరమానందరెడ్డి మొగంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

"ఒరే! నంగినా కొడకా! ఎంత పనిచేసినావురా!" అని మనస్సులో అనుకొన్నాడే కానీ పైకి అనలేకపోయాడు.

"చూడండి ఇన్‌స్పెక్టర్‌గారూ! పరిస్థితి బాగా అర్థమవుతూనే వుంది. అయితే మా పరిస్థితి కూడా కొంచెం ఆలోచించండి. ఈ ఒక్కదినం మాకు అవకాశం ఇవ్వండి. ఊళ్ళో పెద్ద తలకాయిలున్నాయి గదా. రాత్రికి రాత్రే మద్దిస్తం పెట్టిస్తాం. మద్దిస్తంలో తెగకుండా పోతే మేమే రెడ్డయ్యను తెచ్చి మీకప్పగిస్తాం. మీకు తెలియదని కాదు. అక్యూజ్డ్ 'ఆబ్‌సెంట్' అని ఒక్క ముక్క రాసుకుంటే మీ నెత్తిన చెయ్యెత్తే నాయాలు ఎవుడుంటాడు" బాలకృష్ణ కల్పించుకొన్నాడు.

"అది సరే! అనుకో. అయినా వాడున్నాడు గదా మాకడు. ఇదంతా వాడి చెవిలో పడకుండా పోతుందా? వాడు మళ్ళీ పిటిషన్ పెట్తాడు. అప్పుడు మీ గొంతుల మీదికి కాదు. ఏకంగా నా గొంతుకే వస్తుంది"

"అంతదూరం రానిస్తామా సార్. ఈ రాత్రే మద్దిస్తంలో తేల్చి పారేస్తాం. మీరు రండిసార్" అంటూ బలవంతంగా రెడ్డిగారి ఇంట్లోకి పిలుచుకొని పోయాడు.

"రెడ్డిగారూ! మీరు మేటి రైతులు. మిమ్మల్ని యిబ్బంది పెట్ట డంతో నాకేమీ వొరిగేది లేదు. లేదంటే పై ఆఫీసర్లు. వాళ్ళు చెప్పినప్పుడు అది మంచో చెడో మేము పాటించక తప్పదు కదా? అందుకే తటపటాయిస్తున్నాను. ఈ రోజుల్లో హరిజనులు, గిరిజనులతో పెట్టుకోవడమంటే కొరివితో తలగోక్కున్నట్లే. అందుకే చెప్తున్నాను. ఈ రాత్రికే మీరు ఏదో ఒక విధంగా రాజీ పడడం మంచిది. నేను వెళ్ళొస్తాను" అంటూ సబ్-ఇన్‌స్పెక్టర్ రెడ్డిగారి వద్ద సెలవు తీసుకొన్నాడు.

రచ్చబండ వద్ద వ్యాన్ కదిలింది నమస్కారాలుస్వీకరిస్తూ!

ఊరు 'హమ్మయ్య!' అని నిట్టూర్చింది.

పరమానందరెడ్డి బాలకృష్ణ రెండు చేతులు పట్టుకొన్నాడు.

"దీంట్లో ఏముందిలే రెడ్డయ్యా. నువ్వు పద యింటికి. నేను మద్దిస్తానికి ఏర్పాట్లు చేస్తా!" చేతులు విడిపించుకొంటూ బాలకృష్ణ అన్నాడు.

పరమానందరెడ్డి 'సరే!' అన్నట్లుగా తల ఆడించాడు. ఆడించిన తలను వంచాడు. వంచిన తల పైకెత్తకుండా అడుగు మీద అడుగ్గా ఇంటికి నడిచాడు. ఇంట్లో అడుగు పెట్టాడు. పట్టి మంచం మీద కుప్పగా కూలిపోయాడు.

కరెంటు కోత కారణంగా ఇల్లంతా చీకటి!

"నాన్నా!"

కూతురు పిలిచింది. ఆ పిలుపు అందుకొన్నట్లుగా అప్పుడే కరెంట్ వచ్చింది. ఇంటి నిండా వెలుగు. పరమానందరెడ్డి తలపైకెత్తాడు. ఆ వెలుగులో కళావిహీనంగా కూతురి మొగం. ఆ మొగాన్ని చూడ లేనట్లుగా తల వంచుకొన్నాడు.

"మనిషి తెలిసో తెలియకో తప్పు చేస్తాడు. అయితే నమ్మక ద్రోహమంత తప్పు యింకొకటి వుండదు నాన్నా!"

"చచ్చిన పామును కొట్టే దానికే వచ్చినావా అమ్మా!"

రెడ్డయ్య కూతురు ఇందిర భారంగా నిట్టూర్చింది.

** ** **

జాము రాత్రి కావస్తా వుంది. ఊరు మాటు మణిగే వేళ. అయితే ఆ రోజు మాత్రం రచ్చబండ వద్ద సందడి సందడిగా వుంది.

ఊళ్ళో మద్దిస్తం అంటే అక్కడ పరిష్కారం కావలసిన సమస్య ఏదైనా సరే. అది ఎవరికి సంబంధించినదైనా సరే! ఆ ఊళ్ళో ప్రతివ్యక్తి తనదిగానే భావిస్తాడు. అందుకే తలనెరిసిన పెద్దలే కాదు – ఊరూరుగా అక్కడ గుంపు చేరుతుంది.

ఆవేళ మద్దిస్తం సంగతిని మడివేలుతో బాలకృష్ణ ఇంటింటికి చెప్పి పంపాడు. తానే స్వయంగా పోయి మాకడిని మద్దిస్తానికి రమ్మన్నాడు. పరమానందరెడ్డి వెంట బెట్టుకొని రచ్చబండ వద్దకు వచ్చాడు. అప్పటికే గూని గురప్ప.. కుంటి ముత్యాలు.. నల్లమ్మోళ్ళ నాగులు నాయుడు వెంట్రాయులు తాత అక్కడికి చేరుకొన్నారు. వీళ్ళు ఊళ్ళో ఏ మద్దిస్తానికైనా ముందుంటారు. చెప్పే తీర్పు కూడా తన మన అనుకోకుండా చెప్తారు. గుంపు చేరిన ఊళ్ళో వాళ్ళు రచ్చబండ ముందు కూర్చున్నారు. పెద్ద మనుషులు, బాలకృష్ణ, పరమానందరెడ్డి రచ్చబండ మీద కూర్చున్నారు.

తనకు తోడుగా వచ్చిన పది, పన్నెండు మంది పక్కన నిలబడగా మాకడు మడి చేతులు కట్టుకొని పెద్ద మనుషుల ముందు నిలబడ్డాడు.

"ఇంకా ఆలస్యం ఎందుకు? కానీయండి మరి?" అని హెచ్చరించినట్లుగా రచ్చబండ వద్ద సద్దుమణిగింది.

"ఏవిరా మాకా?... నువ్వు చేసిన పని సరిపోతిందంట్రా?" గూని గురప్ప గూటించాడు.

"రెడ్డయ్యను అడగాల్సిన మాట నన్నడిగితే నేనేం జెప్పేది గూనెయ్యా?"

"పోలీసు కంప్లేటు నువ్విచ్చి రెడ్డయ్యను ఏమని అడగమంటా వురా?" కుంటి ముత్యాలు అందుకున్నాడు.

"నేన్జెప్పేది గూడా అదేనయ్యా! నేనెందుకు కంప్లేటు యియ్యాల్సి వచ్చిందో రెడ్డయ్యనే అడగండని"

"ఒరే నీయమ్మా బడవా! నిన్నడగతా వుంటే నువ్వు రెడ్డయ్యను అడగమంటే దాని అర్ధమేందిరా?" వెంకట్రాయులు తాత మందలింపుగా అన్నాడు.

"తాతా! ఊరికైనా వాడకైనా నువ్వు తాతవేగదా? వారికొక నాయం, ఊదరకొక నాయమా? వద్దు. పాలన్నం తినే పది మంది పెద్ద మణుసులుండారు. మీరే చెప్పండి. కుందనపు బొమ్మ నా కూతురు. బాయిలో దూకి సచ్చె. ఎందుకుసచ్చె?"

"గద్ది పొయ్యింది పోనీలేరా. ఇప్పడదెంతా తొవ్వి తలకెత్తుకుంటే ఏమి లాభం? రెడ్డయ్యేవో వాణ్ణి నేను పల్లెత్తుమాట అన్లేదని అంటా వుంటాడు. నువ్వేమో అన్నాని మాట్లన్నాడని కంప్లేటిచ్చినావు. ఎందు కొచ్చినావురా అంటే నువ్వు మల్లా ఎనికెనిక్కిపోతే ఎట్రా?" గూని గురప్ప గుద్దురిమాడు.

"గూనెయ్యో! ఎనిక్కిపోతే గానీ ముందుకు పోలేవు. అదే సెప్తా. అందురు యినండి. నాలో తప్పంటే కాళ్ళు కుండేది సేతికి తీసుకోండి"

"జరిగింది సెప్పి ఏడవరా అంటే యిప్పడెందుకురా ఈ కళ్ళేడుపు. నాగులు నాయుడు కలగ చేసుకొన్నాడు.

"సెప్పి ఏడ్చుకోవాలనే గదా సామీ నే నొచ్చింది. తలా వొకపక్క పట్టుకొని గూటిస్తా వుంటే నేనేమని సెప్పేది" యింకేమని ఏడ్చేది? మల్లా నా కూతురి కత ఎత్తుకుంటే కుపు చించుకుంటే కాళ్ళ కాణ్ణే పడినట్లవుతుంది. ఎవుడు వుణ్ణెం కట్టుకున్నారో ఊరికంతా తెల్సు. అప్పడు మా వాళ్ళంతా నా చుట్టూ చేరుకోని పురెక్కించిరి. రెడ్డయ్య మింద పోలీస్ కంప్లేటియ్యమని సతపోర్రి. సచ్చినబిడ్డె తిరిగి రాబొయ్యేది లేదు. ఒక పెద్ద మణిసిని ఎత్తి యీదిలో పెడ్తే నాకెవురూ కుచ్చల కుళ్ళాయి పెట్టబొయ్యేది లేదు. అంటా వాళ్ళతో వాదులాడ్తి. 'ఈ పొద్దు నీకయింది. రేపు మా కవేదంట్రా కుండాకోర్ నా కొడకా!' అంటూ వాడవాడగా నన్ను నిల్దీసె. నేను వీలుక్కుణ్ణానే గానీ వాళ్ళ మాట్లకు తలొంచినానా? లేదే అప్పడు రెడ్డయ్య పిలిపించె,పోతి. 'ఒరే మాకా! నువ్వింత మంచోడని కల్లో గూడా అనుకోలేదురా. బుద్ధి గెడ్డి తినింది. అయినా కడుపులో పెట్టుకోని కాపాణ్ణావు. తప్పజేసినోడు శిచ్చి అనభవించాల్సిందే. నా తప్పకు నేనే శిచ్చి ఏసుకుంటా వుండా. నువ్వు రాసిచ్చిన నోటు చింపి పారేస్తాము. పోరా!' అనె. రొండు సేతులెత్తి దణ్ణం పెడ్తి. ఆ పొద్దు అట్టనిన పెద్దమణిసి ఈ పొద్దు నోటు కోరట్లో ధాకల్ చేస్తాడా?"


"ఏం రెడ్డయ్యా? నువ్వేమంటావ్?" వెంట్రాయులు తాత అడిగాడు.

"వాడి మాటలు మీరు నమ్ముతున్నారా? తక్కువ జాతోడికి ఎప్పడూ తక్కువ బుద్ధులే. నాకేమన్నా పిచ్చా? లేకపోతే తిమ్మరా? ఒకటా రెండా? అష్టాబాపత్తుగా ఆరువేలే?... అటువంటి నోటును చింపేస్తానని మాట వరసకన్నా ఎప్పడైనా అంటాడా?"

"ఏవిరా మాకా?"

"నా ముగ్గురు బిడ్డెల సాచ్చిగా సెప్తావుండా. నేను అపద్దం సెప్తే వాళ్ళునాకు దక్కరు"

(ముగింపు వచ్చే సంచికలో)



## సైకిల్ వీరుడు!

అతని పేరు ఎన్‌క్లైడ్ ప్రెపెన్ జీవి. 68 సం. తాతగారు. సైకిల్ తొక్కడమంటే అతనికి మహా సరదా! ఇటలీలోని అరిజోనాలో ఉంటున్న జీవి జీన్స్ తయారుచేస్తూ కొద్దిపాటి వ్యాపారం చేస్తూ ఉంటాడు. అతనికి సైకిల్ మీద ప్రపంచ మంతటా చుట్టి రావాలనే తలంపు కలిగింది. వెంటనే ఆమల్లో పెట్టాడు. తన ఊళ్ళో బయల్దేరి 40 వేల మైళ్ళు ఏకటాకీన సైకిల్ తొక్కాడు. రోజుకు 150 మైళ్ళ చొప్పన ప్రెపెన్‌జీ 50 సంవత్సరాలు సైకిల్ తొక్కి ఇప్పటికి 250 ట్రోపీలు, మెడల్స్ బహుమతి గా పొందాడు!

కొడిమెల